సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం | 4 | నవంబర్ | 2022



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

- ఉల్లంఘించిన వ్యాపారులకు నోటీసులు జారీ
- వచ్చే వారం నుంచి ముమ్మర తనిఖీలు

8లో



ఇంకెన్నాళ్లిలా..!

8లో

- మత్స్యగుండంలో భక్తుల అవస్థలు
- కానరాని కర్రల వంతెన
- ప్రమాదకరంగా మత్స్యదేవతల దర్శనం



మెరుగైన వైద్యసేవలు అందించాలి

చింతపల్లి సీహెచ్‌సీ సిబ్బందికి యూనిసెఫ్ ప్రతినిధుల సూచన

8లో

న్యూస్‌రీల్

పాడేరు ఐటీడీఏలో నేటి స్పందన రద్దు

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. విజయవాడలో శుక్రవారం జరిగే రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశానికి తనతో పాటు జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కారణంగా పాడేరు ఐటీడీఏలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని ఆయన వివరించారు. గిరిజనులు ఎవరు స్పందన కార్యక్రమానికి రావొద్దని ఆయన సూచించారు. ఈ నెల 11 తేదీ శుక్రవారం ఐటీడీఏలో యథావిధిగా స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కోర్టు కేసుల విచారణ 18కు వాయిదా

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు : స్థానిక ఐటీడీఏలో ఈ నెల 4వ తేదీన నిర్వహించాల్సిన కోర్టు కేసుల విచారణను ఈ నెల 18వ తేదీ నాటికి తాత్కాలికంగా వాయిదా వేశామని ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు కేసుల వాయిదాను కక్షిదారులు, ఫిర్యాదుదారులు గమనించాలని ఆయన కోరారు.

సదరం శిబిరాన్ని విజయవంతం చేయాలి



సదరం శిబిరం ఏర్పాట్లను పరిశీలిస్తున్న చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ కిషోర్

చింతపల్లి: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సదరం శిబిరాలను విజయవంతం చేయాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ కోరారు. స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న శిబిరం ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. సీఐ రమేష్, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కొయ్యూరు దివ్యాంగులకు..

కొయ్యూరు: చింతపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కొయ్యూరు మండలానికి చెందిన చెందిన దివ్యాంగుల కోసం ఈనెల ఐదున ప్రత్యేకంగా సదరం క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో మేరీరోజ్ తెలిపారు. నాలుగో తేదీన చింతపల్లి గూడెం మండలాలకు, ఐదవ తేదీన కొయ్యూరు మండలం దివ్యాంగులకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సదరం శిబిరానికి వెళ్లే వారు ఆధార్ కార్డుకు అనుసంధానం చేసిన ఫోన్ (నంబరు) తీసుకు వెళ్లాలన్నారు. నమోదు సమయంలో ఓటీపీ వారి మొబైల్‌కు వస్తుందని ఆమె సూచించారు.

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష



జోలాపుట్టులో అంబలం పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

- జోలాపుట్టులో అయ్యప్ప స్వాముల శరణు ఘోష
- 300 మంది స్వాములతో అంబలం పూజ

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో అయ్యప్ప స్వాముల శరణు ఘోష మార్మోగింది. జోలాపుట్టు జలాశయం వద్ద కొలువైన అయ్యప్ప స్వామి మండపాల వద్ద బుధవారం రాత్రి 300 మందికిపైగా స్వాములు అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం ఎస్ఈ కేవీ నాగేశ్వరరావు దంపతులు గురుస్వాములు సూరిబాబు, గుప్తేశ్వరరావు, రాంబాబులను సత్కరించారు.

హమ్మమ్మ.. అయ్యన్నా



సింహాచలం ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అయ్యన్న, ఆయన తనయుడు రాజేష్

- తప్పుడు పత్రాలతో స్థలం కబ్జా
- ఏకంగా కోర్టునే తప్పుదోవ పట్టించిన వైనం
- పంట కాలువను ఆక్రమించి ఇంటి నిర్మాణం
- కూల్చివేసేందుకు ప్రయత్నిస్తే ఫోర్జరీ ఎన్‌వోసీలతో అడ్డుకునే యత్నం
- ఇంజినీర్ ఫిర్యాదుతో వెలుగులోకి వ్యవహారం
- తీరా ఫోర్జరీ అని తేలడంతో తెరపైకి కులం కార్డు

శకునం చెప్పే బల్లి కుడితిలో పడ్డట్టుగా ఉంది టీడీపీ నేత, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు వ్యవహారం. నోరు తెరిస్తే బూతులతో పాటు నీతులు చెప్పే అయ్యన్న.. తనవరకు వచ్చే సరికి మాత్రం ఫోర్జరీ పత్రాలతో నిరంభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) సృష్టించి తప్పును ఒప్పుగా చూపించుకునే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా ఏకంగా కోర్టును కూడా తప్పుదోవ పట్టించి తన అక్రమ ఇంటి కట్టడాన్ని కూల్చేయకుండా స్టే తెచ్చుకున్నారు. కాలువ భూమిని ఆక్రమించి.. కట్టుకున్న తన ఇంటిని సక్రమమైన నిర్మాణం చేసుకునేలా అయ్యన్న వ్యవహరించిన తీరు అందరూ ఛీత్కరించుకునేలా ఉంది. మరోవైపు అయ్యన్న చేసింది అక్రమమని తేలిన నేపథ్యంలో సీఐడీ రంగంలోకి దిగడంతో టీడీపీ నేతలు బీసీ కార్డును ఉపయోగించడం మరీ విడ్డూరంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

అక్రమ నిర్మాణం.. సక్రమం చేసుకునేలా..



పంట కాలువను ఆక్రమించి నిర్మించిన అయ్యన్నపాత్రుడి ఇల్లు

నర్సీపట్నంలోని అయ్యన్న పాత్రుడు ఇంటికి ఆనుకుని పంట కాలువ ఉంది. నిర్మాణ సమయంలో బిల్డింగ్ అనుమతి కోసం ఇచ్చిన దరఖాస్తులో కూడా తాము నిర్మించబోయే ఇంటికి దక్షిణం, పశ్చిమాన పంట కాలువ ఉందని స్పష్టంగా పేర్కొన్నారు. తీరా నిర్మాణం సమయం.. అది కూడా టీడీపీ అధికారంలో ఉన్న సమయం కావడంతో ఏకంగా పంట కాలువను ఆక్రమించి ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. ఇన్నాళ్లుగా గుట్టుగా ఉన్న ఈ వ్యవహారం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బట్టబయలైంది. ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన డ్రైవ్‌లో భాగంగా రెవెన్యూ యంత్రాంగం సర్వే చేసింది. ఇందులో జలవనరుల శాఖకు చెందిన పంట కాలువను ఆక్రమించి అయ్యన్న కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణాన్ని చేపట్టారని సర్వేలో తేలింది. ఈ మేరకు చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ యంత్రాంగం ఉపక్రమించింది. అక్రమంగా పంట కాలువలో నిర్మించిన నిర్మాణాన్ని కూలదోసేందుకు ప్రయత్నిస్తే తన నోటి దురుసుతో ఇష్టారాజ్యంగా ప్రవర్తించి అధికారులను అడ్డుకున్నారు. అదే సమయంలో అక్రమ నిర్మాణం కాదంటూ ఫోర్జరీ సంతకాలతో నిరంభ్యంతర పత్రం(ఎన్‌వోసీ)ను సృష్టించి.. సక్రమ నిర్మాణమేనని చెప్పుకునేందుకు యత్నించారు. తీరా సదరు అధికారి ఎన్‌వోసీలో ఉన్నది తన సంతకం కాదని స్పష్టం చేసి సీఐడీకి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయట కొచ్చింది.

ఫోర్జరీ సంతకాలు.. తప్పుడు స్టాంపు పేపర్లు

చింతకాయల విజయ్ పేరుతో నర్సీపట్నంలో అయ్యన్న కుటుంబ సభ్యులు 2017లో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం నర్సీపట్నం మున్సిపాలిటీకి సర్వే నంబర్లు 277, 278/1లోని 387.33 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణానికి అనుమతి కోరుతూ దరఖాస్తు(సెటిల్‌మెంట్ డీడ్ నం–3660 ఆఫ్ 2017) చేశారు. దక్షిణం, పశ్చిమం వైపు పంట కాలువ ఉన్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఈ కాలువను ఆక్రమించి మరీ నిర్మాణం చేపట్టారు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి పెట్టడంతో ఫోర్జరీ సంతకాలతో నిరంభ్యంతర సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) సృష్టించడమే కాకుండా ఏకంగా కోర్టునే తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారు. 2019 ఫిబ్రవరి 25న ఇంటి నిర్మాణం కోసం ఎన్‌వోసీని జలవనరులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లికార్జునరావు సంతకంతో ఇచ్చినట్టుగా కోర్టులో సమర్పించారు. దీనిని పరిశీలించిన ఈఈ ఎన్‌వోసీలో ఉన్నది తన సంతకం కాదని గుర్తించారు. అంతేకాకుండా దీనిపై కార్యాలయంలోని ఫైళ్లను పరిశీలించగా.. తాను ఇవ్వలేదని గుర్తించారు. కోర్టుకు సమర్పించిన ఎన్‌వోసీ పత్రాల్లో ఉన్న సంతకం తనది కాదని కూడా స్పష్టమైంది. ఈ నేపథ్యంలో తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని పేర్కొంటూ జలవనరులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లికార్జునరావు సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వాస్తవానికి వాగు, కెనాల్, నాలా, డ్రెయిన్ బౌండరీకి 9–10 మీటర్లలోపు ఎటువంటి నిర్మాణం చేపట్టరాదని ఏపీ బిల్డింగ్ చట్టం –2017 చెబుతోంది. ఇందుకు అనుగుణంగా కెనాల్ బౌండరీని మొదటగా నిర్ణయించాల్సి ఉంటుంది. అసలు ఇక్కడ కెనాల్ బౌండరీని నిర్ణయించకుండా ఎన్‌వోసీ ఇవ్వడం సాధ్యం కాదు. అయినప్పటికీ తన పేరుతో ఎన్‌వోసీ ఇచ్చినట్టుగా కోర్టులో చూపారని ఈఈ మల్లికార్జునరావు పేర్కొన్నారు. అసలు ఆ డాక్యుమెంటులో ఉన్న సంతకం తన స్టయిల్‌లో చేసిన సంతకం కాదని.. సంతకం కింద తేదీ వివరాలు పేర్కొనడం కూడా ఫోర్జరీనేనని తెలిపారు. మరోవైపు కార్యాలయం సీల్ కూడా తమది కాదని కూడా స్పష్టం చేశారు. ఈ మేరకు సీఐడీకి 30 సెప్టెంబరు 2022లో ఈఈ ఫిర్యాదు చేయగా... దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత ఇన్‌స్పెక్టర్ పైడిరాజు విచారణ అధికారిగా తన నివేదికను సమర్పించారు. ఈ నివేదికలో ఫోర్జరీ ఎన్‌వోసీ వ్యవహారం స్పష్టంగా తేటతెల్లమైంది.

కప్పిపుచ్చుకునేందుకు కులం కార్డు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో వందల కోట్ల విలువ చేసే భూములను కాపాడింది. 430 ఎకరాల మేర ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది. ఇందులో భాగంగానే నర్సీపట్నంలో కూడా అయ్యన్న కుటుంబసభ్యులు ఇంటి నిర్మాణం కూడా పంట కాలువను ఆక్రమించి నిర్మించారని సర్వేలో తేలింది. ఈ అక్రమ నిర్మాణాన్ని కూలగొట్టేందుకు యతి్నంచగా భౌతికంగా అడ్డుకునే ప్రయత్నంతో పాటు ఈ నిర్మాణానికి ఎన్‌వోసీ ఉందంటూ ఫోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించారు. అది తీరా సీఐడీ విచారణలో ఫోర్జరీ అని తేలడంతో చివరకు టీడీపీ నేతలు కులం కార్డును తెరమీదకు తెచ్చారు. వాస్తవానికి గతంలో ఏ ప్రభుత్వ హయాంలో లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మేలు చేస్తోంది. బీసీల్లో గతంలో ఎన్నడూలేని విధంగా మెజార్టీ కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారికి రాజకీయ అధికారాన్ని కట్టబెట్టింది. మరోవైపు టీడీపీ మాత్రం అమరావతి ప్రాంతంలో సామాజిక సమీకరణ దెబ్బ తింటుందని పేర్కొంటూ అదే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయితే చట్టాన్ని సవరించి మరీ పట్టాలను ఇచ్చే ప్రయత్నం చేస్తుంటే.. దానిని కూడా టీడీపీ నేతలు అడ్డుపడుతున్నారు. ఆయా వర్గాలపై తనకున్న వ్యతిరేకతను నిర్లజ్జగా కనబరుస్తున్న టీడీపీ.. అక్రమ వ్యవహారంలో కూరుకున్న అయ్యన్న విషయానికి వచ్చేసరికి మాత్రం బీసీ కార్డును ప్రయోగిస్తుండం ఆశ్చర్యం కలిగిస్తోంది.

టీడీపీ నేత వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నేత రాజారావును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

పెదబయలు : మండలంలోని కిముదుపల్లి పంచాయతీ గాదెపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, టీడీపీ ఎస్టీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేత కొర్ర రాజారావు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు బుధవారం విజయవాడలో డిప్యూటీ సీఎం రాజన్నదొర పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పెదబయలు జెడ్పీటీసీ బొంజుబాబు, పార్టీ నేతలు సురేష్, కొండలరావు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే మంచి భవిష్యత్తు

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్



జి.మాడుగుల కస్తూర్బా విద్యాలయంలో నాడు–నేడు పనులు పరిశీలిస్తున్న డీఈవో రమేష్

జి.మాడుగుల: విద్యార్థులు లక్ష్యసాధనతో చదివితే మంచి భవిష్యత్తు పొందవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె. రమేష్ సూచించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోని తేవాలని సూచించారు. విద్యార్థినులకు నిర్వహిస్తున్న సీబీఏ ఆన్‌లైన్ పరీక్షను ఆయన పరిశీలించారు. ఎంఈవో కె.నాగభూషణం,ప్రత్యేకాధికారి పార్వతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం

పందిరిమామిడి కేవీకే కోఆర్డినేటర్ లలితకామేశ్వరి



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కేవీకే కోఆర్డినేటర్, బోర్డు సభ్యులు, శాస్త్రవేత్తలు

రంపచోడవరం: ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ పి.లలితకామేశ్వరి సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఐసీఎఆర్–అటారి, జోన్–10 హైదరాబాద్ వారు ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ప్రాజెక్టు చేపట్టేందుకు అనుమతి ఇచ్చినట్టు ఆమె తెలిపారు.దీనిలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలోని 24 మండలాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ,శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం బోర్డు మెంబరు పి.దేముళ్లు మాట్లాడుతూ ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి పర్యావరణ హితమైన కాలుష్య రహిత ఆహారం పొందాలన్నారు. అలాగే అంతరించిపోతున్న దేశవాళీ పంట రకాలను వాటి విత్తనాల ద్వారా కాపాడుకోవాలన్నారు. దేశవాళి మొక్కజొన్న విత్తన రకాలను కృషి విజ్ఞాన కేంద్రం వారికి అందజేశారు. ప్రకృతి వ్యవసాయం, రైతులకు సేంద్రియ పంట ధ్రువీకరణ (ఆర్గానిక్ సర్టిఫికెట్లు)పై చర్చించారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు బి.మోహనరావు, జె.ఎలియజర్, తాతారావు, కేవీకే శాస్త్రవేత్తలు పి.రాజశేఖర్, ప్రవీణ్‌బాబు, టి.క్రాంతికుమార్, ఎస్ చిరంజీవి, కె వీరంజనేయులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షానికి పొంగిన వాగులు



దేగలపుట్టు వద్ద నీటమునిగిన వరి పొలాలు



ముంపు పొలాలను పరిశీలిస్తున్న చెట్టి వినయ్

- నీట మునిగిన పంట పొలాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

ముంచంగిపుట్టు: మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. మండలంలో లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో ముంత్తగుమ్మి, బిరిగూడ, కోజిరిగూడ వాగులు ఉప్పొంగాయి. దీంతో గిరిజనులు ప్రాణాలకు తెగించి రాకపోకలు సాగించారు. ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గంలో రహదారిపై పలు చోట్ల వరద నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్రిముఖీపుట్టు, కించాయిపుట్టు, వనభసింగి, దారెల, పెదగూడ, కిలగాడ పంచాయతీల పరిధిలో పంట పొలాలు నీటమునిగాయి. సాములు,రాగులు తదితర పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు

ముంపు ప్రాంతాల పరిశీలన

మండలంలోని జర్రెల పంచాయతీ దేగలపుట్టు గ్రామ సమీపంలో వర్షానికి దెబ్బతిన్న ముంపు పొలాలను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మల్లికార్జున, పార్టీ నేతలు జేవీవీఎస్ మూర్తి, జయదేవ్, రాంప్రసాద్, పులిరాజు, దాసు, ఉదయ్,ప్రసాద్ పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.ప్రభుత్వం తరఫున ఆదుకునేలా కృషి చేస్తామని చెట్టి వినయ్ హామీ ఇచ్చారు.

కాఫీ రైతుకు బాసటగా..

ఏజెన్సీలో కాఫీ పండించే రైతులు దళారుల బారిన పడకుండా గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఐటీడీఏ ఆధ్వర్యంలో మ్యాక్స్ సొసైటీ, గిరిజన సహకార సంస్థ ముందుకు వచ్చాయి. వీటికి పోటీగా కొనుగోలు చేసేందుకు మరికొన్ని సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఇప్పటికే కాఫీ రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. రైతులు సంఘటితంగా ఏర్పడితే మంచి ధర పొందవచ్చని వారు రైతులకు సూచించారు.



ఏజెన్సీలోని అరకులోయ ప్రాంతంలో విరగ్గాసిన కాఫీ పండ్లతో గిరిజన రైతు

- అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు
- పండ్ల దశలోనే కొనుగోలుకు ఏర్పాట్లు
- లాభాల నుంచి బోనస్ పంపిణీ: ఐటీడీఏ
- పాచ్‌మెంట్ తయారీకి ఎకో పల్పింగ్ యూనిట్
- పోటీపడుతున్న ప్రైవేట్ సంస్థలు

కాఫీ సాగు:	2.2 లక్షల ఎకరాలు
ఫలసాయాన్నిచ్చేది:	1.4 లక్షల ఎకరాలు
దిగుబడి :	సుమారు 71 వేల మెట్రిక్ టన్నులు

సాక్షి, పాడేరు : కాఫీ రైతులపై దళారీ వ్యవస్థ ప్రభావం లేకుండా ఉండేందుకు జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. ఈఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో కాఫీ విరగ్గాసింది.ప్రస్తుతం కోత దశకు చేరు కోవడంతో పండ్ల సేకరణ, అమ్మకాలు, పాచ్‌మెంట్ కాఫీ గింజల తయారీలో కాఫీ రైతులు నిమగ్నమయ్యారు.

కొనుగోళ్లపై దృష్టి

పాడేరు ఐటీడీఏ, జీసీసీ, పలు ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు కాఫీ కొనుగోళ్లపై దృష్టి సారించాయి. ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో 2.2 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు ఉండగా 1.4 లక్షల ఎకరాల్లో తోటలు ఫలసాయం ఇస్తున్నాయి. వీటి ద్వారా సుమారు 71 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లు దిగుబడి వస్తున్నాయి. సుమారు 8 వేల టన్నుల వరకు పాచ్‌మెంట్ కాఫీ గింజలను రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. ఆరు కిలోల కాఫీ పండ్ల నుంచి కిలో పార్చ్‌మెంట్ కాఫీ గింజలు తయారవుతాయి.

ధర ప్రకటనతో..

- కాఫీ రైతుల నుంచి పండ్ల దశలోనే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పాడేరు ఐటీడీఏ ఆధీనంలోని చింతపల్లి మ్యాక్స్ సొసైటీ కాఫీ పండ్లు కిలో రూ.36కు కొనుగోలు చేస్తుందని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ప్రకటించారు. తరువాత బోనస్ కూడా పంపిణీ చేస్తుందని ఆయన వెల్లడించారు.
- ఏజెన్సీలోని నాంది, మన్య తోరణంతో పాటు పలు ప్రైవేటు సొసైటీలు, గిరిజన వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు కూడా వేర్వేరుగా కాఫీ పండ్లను కొనుగోలు చేయడంలో నిమగ్నమయ్యాయి. ఇవి గతేడాది కాఫీ పండ్లు కిలో రూ.35 నుంచి రూ.45 ధరతో కొనుగోలు చేశాయి. వీటిని పాచ్‌మెంట్ తయారు చేసి అమ్మకాల ద్వారా వచ్చిన లాభాల్లో కిలోకు రూ.5 చొప్పున రైతులకు పంపిణీ చేశాయి.
- చింతపల్లి మ్యాక్స్ సొసైటీ ద్వారా పెద్ద ఎత్తున కాఫీ పండ్ల కొనుగోలుకు పాడేరు ఐటీడీఏ విస్తృత ప్రచారం చేస్తోంది.
- చింతపల్లిలో ఇప్పటికే ఐటీడీఏ ఎకో పల్పింగ్ యూనిట్‌ను రూ.కోట్లతో నిర్మించి ప్రారంభించింది. గంటకు మూడు టన్నుల చొప్పున పార్చ్‌మెంట్ కాఫీ ఉత్పత్తి అవుతోంది. ఇందుకు గాను కిలోకు రూ.2 చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుంది.
- చింతపల్లిలో మాదిరిగానే జి.మాడుగుల, గూడెం కొత్తవీధిలో కూడా ఎకో పల్పింగ్ యూనిట్లు ప్రారంభించేందుకు ఐటీడీఏ సన్నాహాలు చేస్తోంది.
- గిరిజన సహకార సంస్థ గత ఏడాది పాచ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.260కు కొనుగోలు చేసింది. ఈ ఏడాది కిలో రూ.270 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రకటించింది. చెర్రీ రకం రూ.135, రొబస్టా రకం రూ.60కు కొనుగోలుకు నిర్ణయించింది.

అడ్వాన్సులతో ఆకట్టుకుంటూ..

ప్రైవేటు వ్యాపారులు దళారీలు కూడా గిరిజన రైతులకు అడ్వాన్సులు చెల్లిస్తూ కాఫీ కొనుగోళ్లకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం బెంగళూరు కాఫీ మార్కెట్‌లో పాచ్‌మెంట్ కాఫీ గింజలకు కిలో రూ.300 చొప్పున ధర పలుకుతుంది. సీజన్ ప్రారంభమయ్యే సరికి ధరలు పెరిగే పరిస్థితులు ఉన్నాయి.

ఆర్థికంగా చేయూత నిస్తున్న జీసీసీ

పాడేరు, చింతపల్లి డివిజన్ల పరిధిలో కాఫీ రైతులకు గిరిజన సహకార సంస్థ రుణాలను కూడా పంపిణీ చేసింది. కొద్ది రోజులుగా కాఫీ రైతుల ఖాతాల్లో రూ.10వేల నుంచి రూ.25వేల వరకు అడ్వాన్సుల రూపంలో రుణాల సొమ్ము జమ అవుతున్నాయి.

ఎక్కడికక్కడ కాఫీ పంట తమకే అందాలని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు పోటీ పడుతున్నాయి. రైతులు మాత్రం పండ్ల దశలో విక్రయించాలా.. పాచ్‌మెంట్ తయారు చేసి అమ్ముకోవాలా.. అన్న ఆలోచనలో ఉన్నారు.

పండ్ల దశలో కొనుగోలు



ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాల ఆదేశాల మేరకు చింతపల్లి మ్యాక్స్ సొసైటీ ద్వారా పండ్ల దశలోనే కాఫీని కొనుగోలు చేస్తున్నాం. కిలో రూ.36ల ధరను ఐటీడీఏ ప్రకటించింది. పార్చ్‌మెంట్ తయారీ, అమ్మకాల ద్వారా వచ్చే లాభాలను ఆయా గిరిజన రైతులకే పంపిణీ చేస్తాం. ఈ ఏడాది 71వేల మెట్రిక్ టన్నుల వరకు కాఫీ పండ్లు దిగుబడి సాధించే పరిస్థితులు ఉన్నాయి. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

– అశోక్, కాఫీ ఏడీ, ఐటీడీఏ, పాడేరు

రేపటి నుంచి సౌత్‌జోన్ రోల్‌బాల్ పోటీలు

మురళీనగర్(విశాఖ ఉత్తర): మూడో సౌత్ జోన్ మినీ రోల్‌బాల్ చాంపియన్‌షిప్ క్రీడా పోటీలు మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులోని స్కేటింగ్ క్రీడా మైదానంలో జరగనున్నాయి. విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు ఈ నెల 5న ప్రారంభమై 6వ తేదీ మధ్యాహ్నంతో ముగుస్తాయని రోల్‌బాల్ కోచ్ పూసర్ల సంతోష్ తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఇంకెన్నాళ్లిలా..!

- మత్స్యగుండంలో భక్తుల అవస్థలు
- కానరాని కర్రల వంతెన
- ప్రమాదకరంగా మత్స్యదేవతల దర్శన మార్గం


మత్స్యగుండంలో మత్స్యదేవతల సందర్శనకు వచ్చిన భక్తులు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం మత్స్యగుండం ప్రాంతానికి నిత్యం భక్తులు, సందర్శకులతో కళకళలాడుతోంది. ప్రత్యేక పర్వదినాల్లో వందిలాది భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు. కార్తీక మాసంలో రోజూ స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కుటుంబసమేతంగా ఇక్కడికి వచ్చి మత్స్యదేవతలను దర్శించుకొని, పూజాధి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇంత ప్రాముఖ్యత సంతరించుకున్న మత్స్యగుండంలో సమస్యలతో భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.మత్స్యదేవతలు (చేపలు) దర్శనానికి భక్తులు తాకిడి అధికంగా ఉన్నప్పటికి గుండం ప్రాంతంలో తాత్కాలికంగా (కర్రల) వంతెన నిర్మాణం లేకపోవడంతో ఇబ్బందిగా మారింది.

ఆదమరిస్తే...అంతే

ప్రస్తుతం కార్తీక మాసంతో తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు, పర్యాటకులు రోజు మత్స్యగుండంకు తరలివస్తున్నారు.గెడ్డ ప్రాంతంలోని బండరాళ్ల దిగువున మత్స్యగుండం ఉంది. ఇక్కడికి చేరుకోవడానికి గతంలో కర్రలతో వంతెన నిర్మించారు. కాలక్రమేణా అది విరిగిపడిపోవడంతో మరలా కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టలేదు. దీంతో మత్స్యదేవతల(చేపలు) దర్శనానికి భక్తులంతా బండరాళ్లను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మత్స్యగుండం ఆనుకుని లోతైన గెడ్డ ప్రవాహం ఉండడంతో బండరాళ్లు దాటే క్రమంలో ఏ మాత్రం ఆదమరిచినా లోతైన గెడ్డలో పడే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యగుండం ప్రాంతాన్ని సందర్శించే వారంతా గుండంలోని మత్స్యదేవతలు(చేపలు)ను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో కొలుచుకుంటారు. ఇక్కడ సరైన సదుపాయం లేక మత్స్యదేవతల దర్శనం ప్రమాదకరంగా మారిందని పలువురు చెబుతున్నారు. అతి కష్టంతో బండరాళ్లు దాటి వెళ్లాల్సి వస్తోందని, మహిళలు, చిన్నారులు దాటేందుకు చాలా అవస్థలు పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మత్స్యగుండం ఆలయ అభివృద్ధి కమిటీ స్పందించి, బండరాళ్లకు ఆనుకుని కొత్తగా కర్రల వంతెన నిర్మించాలని భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు.

సావిత్రి హత్యకేసు నిందితుడు అరెస్ట్


నిందితుడితో సీఐ జీడిబాబు, ఎస్‌ఐలు సంతోష్ కుమార్, కుమార్‌బాబు

అరకులోయ రూరల్ : సావిత్రి హత్యకేసు నిందితుడిని అరెస్ట్ చేసినట్టు సీఐ జీడిబాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గత నెల 29న డుంబ్రిగుడ మండలం కొల్లాపూట్టు పంచాయతీ నందివలస గ్రామానికి చెందిన సావిత్రి అనే మహిళని, అదే గ్రామానికి చెందిన జన్ని రాంచందర్ అలియాస్ రాంప్రసాద్ అనే వ్యక్తి హత్య చేసిన సంఘటనపై కేసు దర్యాప్తు వేగవంతం చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకులోయ, డుంబ్రిగుడ ఎస్‌ఐలు సంతోష్‌కుమార్, కుమార్‌బాబు పాల్గొన్నారు.

నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు పునరుద్ధరించండి


విశాఖలో ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

సీలేరు: మన్య ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సులు నడపడానికి ఆర్టీసీ అధికారులు దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. ఈ మేరకు విశాఖపట్నంలో ఆర్టీసీ ఆర్ఎం అప్పలరాజుకు గురువారం సీలేరు నైట్‌హాల్ట్ ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె సీలేరులో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మండల పర్యటనలో సీలేరు నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు సమస్యను గిరిజనులు, వ్యాపారులు స్థానికులు ఇబ్బందులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో విశాఖలోని ఆర్టీసీ ఆర్ఎంకు ప్రజల ఇబ్బందులను తెలియజేసి బస్సు సర్వీసుకు వినతిపత్రాన్ని అందజేసినట్టు ఆమె చెప్పారు. ఈ మేరకు ఆర్టీసీ ఆర్ఎం గిరిజనుల సమస్యపై బస్సు పునరుద్ధరణకు దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారని ఆమె చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న డాక్టర్ వెంకటలక్ష్మికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి గ్రాప్లింగ్ పోటీలకు వడ్డాది విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, సిబ్బంది

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయి గ్రాప్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 28 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు తిరుపతిలో రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు ఎస్. లోకేష్, ఎల్. రాహుల్ రజత పతకాలు, ఏ. సూర్య, కె. గణేష్, ఎం. దుశ్యంత్ కాంస్య పతకాలు సాధించారు. వీరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శేషుబాబు, పీడీ నారాయణమ్మ తెలిపారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. విద్యార్థులను నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

చింతపల్లి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీని యూనిసెఫ్(విజయవాడ) ప్రతినిధులు గురువారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. మాతా శిశుమరణాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. క్వాలిటీ మేనేజర్లు డాక్టర్ రాకేష్, లలిత, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పసుపు సాగులో మెలకువలు తప్పనిసరి


తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి: గిరిజన రైతులు సాగు చేస్తున్న పసుపులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు. లంబసింగిలో పర్యటించి పసుపు తోటలను ఆయన గురువారం పరిశీలించారు.

రైతులు వాణిజ్య పరంగా సాగు చేస్తున్న పసుపులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతుల్లో అవగాహన కల్పించాలని ఆయన స్థానిక శాస్త్రవేత్తలను సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి


హాజరైన విద్యార్థులు


మాట్లాడుతున్న బుల్లికృష్ణ

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

చోడవరం రూరల్ : విద్యార్థి దశలోనే చట్టం, న్యాయం పట్ల అవగాహన పెంచుకుంటే జీవితంలో ఎదురయ్యే అనర్థాలను దీటుగా ఎదుర్కొనగలిగే మానసిక దృఢత్వం అలవడుతుందని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బుల్లికృష్ణ అన్నారు. గురువారం ఇక్కడి కోర్టుల సముదాయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, చోడవరం మండల న్యాయ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడకం, అమ్మకం, సరఫరా వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు చట్టం నిర్దేశిస్తున్న శిక్షల గురించిన అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కోర్టుల్లో ఉచిత న్యాయసహాయం పొందడం ఎలా అన్న విషయాన్ని వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ మాట్లాడుతూ మహిళల రక్షణకు చట్టం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కోవడానికి చట్టం కల్పిస్తున్న అవకాశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి మాట్లాడుతూ కోర్టులలో సత్వర న్యాయం అందించడానికి న్యాయసేవాధికార సంస్థ చేస్తున్న కృషిని తెలియచేశారు. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ప్రకాశరావు, లెక్చరర్ వెంకటలక్ష్మి తదితరులు మాట్లాడారు. ఉషోదయా డిగ్రీ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. సదస్సు అనంతరం 'సే నో టు డ్రగ్స్' అంటూ విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బుల్లికృష్ణ స్థానిక సబ్ జైలును సందర్శించారు. రిమాండ్ ఖైదీలకు సబ్ జైలులో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే ఆహారం నాణ్యత, శుచి, శుభ్రతలను పరీక్షించారు.

విశాఖ వెళ్లి రోగికి పింఛన్ అందజేత

రోలుగుంట: మండలంలోని వడ్డిప పంచాయతీకి చెందిన కర్రి సత్యనారాయణ అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకుని గ్రామ వలంటీర్ శ్రావణి గురువారం అక్కడకు వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను గ్రామ పెద్దలు అభినందించారు.

ప్రశాంతంగా పోస్టల్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విశాఖ డివిజన్ పోస్టల్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు గురువారం పాతనగరం పాత పోస్టాఫీస్ సమీపంలో గల కమ్యూనిటీ భవన్‌లో ప్రశాంతంగా జరిగాయి. 11 డైరెక్టర్ల పదవులకు గాను 17 మంది పోటీ పడ్డారు. 493 మంది సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నిక జరిగింది. అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అప్పలరమణ, ఆర్. సన్యాసిరావు, ఎస్.ఆదినారాయణ, కాళ్ల గౌరీశంకర్, కె.ప్రదీప్, కె.సురేష్‌కుమార్, జి.వెంకట్రావు, డి.వెంకట జయకృష్ణ, పి.అప్పలనాయుడు, పి.రామానందం, పి.విజయ్‌కుమార్, బొచ్చా శ్రీరామమూర్తి, బోని చంద్రశేఖర్, బరిలో నిలిచారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

ఉల్లంఘించిన వ్యాపారులకు నోటీసులు

సాక్షి,పాడేరు: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని పాడేరు పట్టణంతో పాటు,అన్ని గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం అమలుజేస్తున్నారు. కలెక్టర్,ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు పంచాయతీ పాలకవర్గం అన్ని దుకాణాల యాజమానులు, చిరువ్యాపారులకు నోటీసులు జారీ చేసింది. ఈనెల ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు తదితన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించారు. దీంతో ఆయా వ్యాపారులందరికీ పంచాయతీ సిబ్బంది స్వయంగా నోటీసులు అందిస్తున్నారు. వచ్చే వారం నుంచి తనిఖీలు ముమ్మరం చేయనున్నారు. ఇకనుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దుకాణాల్లో లభ్యమైతే కేసులు నమోదు చేస్తామని అధికారవర్గాలు తెలిపాయి.

13న హిందూ విరాట్ సమ్మేళనం


మాట్లాడుతున్న ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి

సీతంపేట: ఎంవీపీ ఆల్వార్‌దాస్ గ్రౌండ్స్‌లో ఈనెల 13న హిందూ విరాట్ సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 108 పీఠాధిపతులు, నాగసాధువులు, అఘోరాలు పాల్గొంటారని, రెండు తెలుగు రాష్ట్రాల చరిత్రలో మొదటి సారి భారీఎత్తున జరుపుతున్నామని తెలిపారు. ప్రపంచ మానవాళికి నాగరికత, సంస్కారం నేర్పిన హిందూ ధర్మాన్ని కొందరు అవహేళన చేస్తూ, మన దేవతలకు కించపరచడమే కాక వీడియోలను ఇష్టానుసారంగా చూపిస్తున్నారన్నారు. అటువంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, అటువంటి దాడులను తిప్పికొట్టి మన సనాతన ధర్మాన్ని నేటి యువ తరానికి తెలియజేసి, వారిని సన్మార్గంలో నడిపించేలా దిశానిర్దేశం చేయడమే ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమన్నారు. నెల 13న తేదీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు హిందూ సమ్మేళనం జరుగుతుందని, ఈ సమయంలో హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామం, విష్ణు సహస్ర నామం పారాయణ జరుగుతుందన్నారు. హిందూ బంధువులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దీనిలో పాల్గొనడానికి ఎటువంటి రుసుము చెల్లించక్కరలేదని, భక్తులకు నేపాల్ రుద్రాక్షలు, గంగాజలం అందజేస్తామని తెలిపారు.

పొగాకు, పత్తి రైతుల్లో ఆందోళన


బూరుగపల్లిలో పొగాకు పంటకు నీరు పెడుతున్న రైతులు

రాజవొమ్మంగి: వాతావరణంలో మార్పులు రావడం , కొద్ది రోజులుగా ఎండలు పెరగడంతో గిరిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 15 రోజులుగా వర్షాలు లేక మెట్టప్రాంత రైతులతో పాటు నీటి వనరుల కింద వరి సాగుచేస్తున్న రైతులు సాగుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం మండలంలో 6,445.5 ఎకరాల్లో-వరి, 809.2 ఎకరాల్లో-పత్తి, 1000 ఎకరాల్లో- పొగాకు, 60 ఎకరాల్లో అపరాలు తదితర పంటలు సాగు చేస్తున్నారు. కాగా వర్షాధారంగా మెట్టలో సాగవుతున్న పత్తి, పొగాకు పంటలు నీరు లేక మొక్కలు వడలిపోతున్నాయి. దీంతో రైతులు కొండవాగులకు, చిన్న చిన్న చెరువులు, కందకాలు, కుంటలకు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి నీరు తోడుతున్నారు. ఇది అత్యంత వ్యయప్రయాసాలతో కూడుకున్న పని అయినా రైతులందరూ పొలాలకు నీరందించే పనులు చేపడుతున్నారు. కూలీలతో పాటు ఒకరికొకరు సహాయం చేసుకొంటు ఎండలకు మాడిపోతున్న మొక్కలకు నీరందించే పనిలో బిజీ అయ్యారు. ఒకటి రెండు రోజుల్లో వర్షాలు కురవాలని ఆశపడుతున్నారు.

రేషన్ బియ్యం తరలింపు గుట్టురట్టు

వ్యాన్ బోల్తాతో పట్టివేత

గంగవరం: రేషన్ బియ్యం తరలింపు గుట్టురట్టయింది. వ్యాన్ బోల్తా పడటంతో అక్రమంగా బియ్యం తరలింపు వెలుగు చూసింది. మండలంలోని జగ్గంపాలెం శివారు ప్రాంతంలో గురువారం వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. అందులో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్టు ఎస్ఐ చిన్నిబాబు తెలిపారు. సుమారు 242 బస్తాల్లో 11 టన్నుల బియ్యం తరలిస్తుండగా వ్యాన్ ప్రమాదానికి గురైందన్నారు. చింతూరు ఎగువ ప్రాంతం నుంచి రవాణా జరుగుతున్నట్టుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బియ్యాన్ని అడ్డతీగలలోని గిరిజన సహకార సంస్థ గోదాంకు తరలించి సూపరింటెండెంట్‌కు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధుల నివారణ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పలు వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల స్టాఫ్ నర్సులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లకు గురువారం ప్రారంభించిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఓరల్ హెల్త్, కళ్లు, చెవి, గొంతు సమస్యలు, వృద్ధుల సంరక్షణ తదితర ఆరోగ్య సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అందరికీ అందుబాటులో ఉంటూ 60 ఏళ్ల వయస్సు దాటిన వారికి అత్యవసర వైద్యం అందించడానికి సహకారం ఇవ్వాలని కోరారు. పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. వారు ప్రాథమిక దశలోనే కంటి, చెవి, గొంతు వ్యాధుల గల వారిని గుర్తించి మెరుగైన వైద్య చికిత్సలు అందించడానికి సహకారం అందించాలన్నారు. అవసరమైన పరిస్థితిలో పెద్ద ఆస్పత్రికి పంపించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో వైద్య శాఖ అధికారులు సత్యవతి, కె.ధర్మేంద్ర, ఆర్.స్వర్ణలత, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమయ్యారు.. పోలీసులకు చిక్కారు..

- లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయిన నలుగురు బాలికలు
- ఐదు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు
- గాజువాకలో గుర్తింపు.. తల్లిదండ్రులకు అప్పగింత

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): 'మా కోసం వెతక్కండి.. మేము మా కాళ్ల మీద బతకాలని దూరంగా వెళ్లిపోతున్నాం.. మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలని కాదు.. మా బతుకు కోసం వెళ్తున్నాం.. అలా అని అబ్బాయిలతో వెళ్తున్నాం అని ఎక్కువగా అనేసుకోకండి. కేవలం మేము పైకి ఎదగడానికి మాత్రమే వెళ్తున్నాం. మమ్మల్ని వెతక్కండి. మేము ఎక్కడున్నా సరే మీ గురించే ఆలోచిస్తాం. మేము మంచి పొజిషన్‌కి వచ్చాక మేమే మీ దగ్గరకు వస్తాం..'అంటూ ఓ లేఖ రాసి నలుగురు పదో తరగతి విద్యార్థినులు బుధవారం సాయంత్రం అదృశ్యమైన ఘటన నగరంలో కలకలం రేపింది. ఆ బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి.. నగరమంతా గాలించారు. చివరకు గాజువాకలో నలుగురు బాలికలను గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో కథ సుఖాంతమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పాత నగరంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నలుగురు బాలికలు బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి నేరుగా ఇంటికి వెళ్లారు. యూనిఫాం మార్చుకుని, సివిల్ డ్రెస్‌లో ట్యూషన్‌కు వెళ్తున్నామని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వచ్చి నలుగురూ కలిసి పరారయ్యారు. ట్యూషన్‌కు వెళ్లిన పిల్లలు రాత్రి 10 గంటలు దాటినా ఇళ్లకు చేరుకోకపోవడంతో కంగారు పడిన బాధిత తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయం నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ దృష్టికి వెళ్లింది. వెంటనే సీపీ స్పందించి ఏడీసీపీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా పోలీసులను నియమించి గాలింపు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వేళ సీసీ ఫుటేజీలో పరారైన నలుగురు విద్యార్థినులను గుర్తించారు. వారు ఎక్కడెక్కడకు వెళ్తున్నారో పసిగట్టారు. మరో వైపు అదృశ్యమైన బాలికల ఫొటోలను వలంటీర్ల గ్రూపులో పెట్టారు. బాలికలు నలుగురూ గురువారం మధ్యాహ్నం గాజువాకలో ఓ బంగారు దుకాణం వద్దకు వెళ్లారు. వారి వద్ద ఉన్న బంగారు వస్తువులు అమ్మి, వచ్చిన డబ్బులతో ఎక్కడికైనా వెళ్లిపోదాం అనుకున్నారు. వివిధ వాట్సప్ గ్రూపుల్లో వారి ఫొటోలను గమనించిన ఆ దుకాణ యజమాని.. పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి విద్యార్థినులకు కౌన్సిలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

పెదబయలు ఎంఈవోపై లైంగిక దాడి కేసు నమోదు


ఎంఈవో సింహాచలం

పెదబయలు: స్థానిక ఎంఈవో కె.సింహాచలంపై లైంగికదాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మండల కేంద్రం పెదబయలులో కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2018 నుంచి 2022 వరకు పెదబయలు ఎంఈవో కె.సింహాచలం శారీరకంగా వాడుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఎంఈవోపై లైంగిక దాడి, చీటింగ్ కేసులు నమోదు చేసినట్టు ఆయన వివరించారు. ఎంఈవోకు సహకారం అందిస్తూ బాధిత మహిళను ప్రలోభాలకు గురి చేసినందుకుగాను ముగ్గురు ఉపాధ్యాయులపై కూడా కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.